మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట






మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

## కాంగ్రెస్ హామీల అమలు ఎక్కడ ?

- బతుకమ్మ చీరలతో మభ్యపెడుతున్నరు
- ప్రతి మహిళపై రూ.60 వేల బాకీ పెట్టిన కాంగ్రెస్
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఫైర్

**నారాయణపేట, డిసెంబరు 12 ప్రభాతవార్త :** నారాయణపేటలో జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ప్రతినెలా రూ.2,500 పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోగా, ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రతి మహిళకు ప్రభుత్వం సుమారు రూ.60వేల మేర బాకీ పెట్టిందని బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. ఇచ్చిన పింఛన్ హామీలను అమలు చేయలేకపోతున్న ప్రభుత్వం ఇప్పుడు బతుకమ్మ చీరల పేరుతో వారిని మురిపించేందుకు ప్రయత్నిస్తోందని ఆమె ఎద్దేవా చేశారు. భూములను అమ్ముకునే స్థితిలో రాష్ట్రాన్ని నెట్టిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని రోడ్లు వేయడానికి, ప్రభుత్వ పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని, బిల్లులు చెల్లిస్తారన్న విశ్వాసం లేకపోవడం ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. గ్రామీణాభివృద్ధి పరంగా కేంద్ర నిధుల ద్వారానే పథకాలు అమలవుతున్నాయని, కేంద్రం నేరుగా పంచాయతీలకు పంపిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి -మిగతా4లో..

---

## అండర్17 జాతీయ ఫుట్‌బాల్ క్రీడకు కల్వకుర్తి విద్యార్థి



అక్షరను సన్మానిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

**కల్వకుర్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో ఈనెల 18న నిర్వహించే అండర్-17 జాతీయ ఫుట్‌బాల్ క్రీడకు తెలంగాణ రాష్ట్రం నుండి నాగర్‌కర్నూల్ జిల్లా నుండి కల్వకుర్తి పట్టణంలోని విస్డమ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అక్షర ఎంపికయ్యారు. జాతీయ ఫుట్‌బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థిని అక్షరను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ శుక్రవారం తన చాంబర్‌లో శాలువా కప్పి అభినందించి సన్మానించారు. విద్యార్థినులు విద్యాతోపాటు క్రీడా రంగంలో రాణించాలని అక్షరను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అదే విధంగా జాతీయ స్థాయి క్రీడకు ఎంపికైన అక్షరను పాఠశాల యజమాన్యం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

---



దామరగిద్దలో చలిమంట కాచుకుంటున్న గ్రామస్తులు

## వణుకుతున్న పాలమూరు

- ఉమ్మడి జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అత్యల్పం నారాయణపేటలో 8డిగ్రీలు
- మూడు జిల్లాల్లో సింగిల్ డిజిట్‌కు చేరిన వైనం
- రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రత
- కనిష్ట స్థాయికి టెంపరేచర్

**మహబూబ్‌గర్ బ్యూరో, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు వణుకుతోంది. గత నాలుగు రోజుల నుంచి చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. సాయంత్రం అయిందంటే చలిగాలులకు జనం అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు చేరడంతో ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. మహబూబ్‌గర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలో సిగింల్ డిజిట్‌కు టెంపరేచర్ పడిపోయింది. పాలమూరులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఏడాది ఇదే నెలలో ఇదే రోజున 14 డిగ్రీలు ఉండగా ఏ యేడాది సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం 4గంటల తర్వాతే చల్లగాలులు వీయడంతో చలితీవ్రత మొదలవుతుంది. ఉమ్మడి జిల్లాలో నారాయణపేట జిల్లాలో 8డిగ్రీలకు పడిపోయింది.

**బయటకు రాలేని పరిస్థితి..**

ఒక్కసారిగా చలి తీవ్రత పెరగడంతో సాయంత్రం అయ్యిందంటే బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. తెల్లవారుజామున చలికితోడు మంచు కురుస్తుండటంతో ఆ సమయంలో పనులు చేసుకునే వారికి తిప్పలు తప్పడం లేదు. పాల వ్యాపారులు, కూరగాయల రైతులు, మునిసిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మార్నింగ్ వాకర్స్, అయ్యప్ప భక్తులు, కార్తీక పౌర్ణమి వేళ తెల్లవారుజామునే పూజలు చేసుకునే మహిళలు, బడికి పిల్లలను పంపించే తల్లులు, పేపర్‌బాయ్స్, ప్రయాణం చేసేవారు, డ్రైవర్లు చలికి తట్టుకోలేకపోతున్నారు. రానున్న వారం రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. చలికి ప్రజలు స్వెటర్లు, మంకీ క్యాపలు ధరిస్తున్నారు. నగరంలో ఫుట్‌పాత్‌లపై స్వెటర్ల విక్రయాలు జోరందుకున్నారు. దుకాణాలలో స్వెటర్లకు ఆర్డర్లు పెడుతున్నారు. చలికి చేతులు, కాళ్లు పొడిబారడం, పెదాలు పగులుతుండటంతో కోల్డ్ క్రీమ్‌లు వినియోగిస్తున్నారు. కప్పుకునేందుకు ఉలన్ రగ్గులు వాడుతున్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లాలో కొత్తపల్లెలో 8.4డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో కల్వకుర్తిలోని తోటపల్లెలో 9.3డిగ్రీలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్‌లో అత్యల్పంగా 9.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతవాతరణ శాఖ లెక్కల ద్వారా తెలుస్తున్నది. గత ఏడాది నవంబర్‌లో నెలలో ఇదే రోజు 14డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ ఏడాది సుమారు ఆరుడిగ్రీలు తక్కువగా నమోదైంది. ఈ ఏడాది టంపరేచర్ మరింత పడిపోయే అవకాశం ఉందని, చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**వృద్ధులు,చిన్నారులకు జాగ్రత్తలు తప్పనిసరి**

చలి తీవ్రత పెరగడంతో చిన్నాలతోపాటు, వృద్ధులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చలి తీవ్రతకు ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రైవేట్ పాఠశాలలో చదివేవారు బస్సుల్లో ప్రయాణం చేసేవారు ఉదయం ఏడున్నర గంటలకే వారి ప్రయాణం ప్రారంభించాల్సి వస్తుంది . దీంతో వారికి చాలా తిప్పలు తప్పడం లేదు. అయితే చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మంకీ క్యాపలు , స్వెటర్, చేతి బ్లౌజులు తప్పనిసరిగా ధరించి పిల్లలను పాఠశాలకు పంపించాలని సూచిస్తున్నారు.

| శుక్రవారం జిల్లాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు | |
|---|---|
| జిల్లా | ఉష్ణోగ్రతలు |
| నారాయణపేట | 8.4 |
| నాగర్ కర్నూల్ | 9.3 |
| మహబూబ్నగర్ | 9.4 |
| జోగులాంబ గద్వాల | 10.7 |
| వనపర్తి | 11.0 |

---

## రెండో విడుతకు భారీ బందోబస్తు

- ఎన్నికల ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలు
- పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి : మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి



**మహబూబ్‌గర్ డిసెంబర్ 12, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని హన్వాడ, కోయిలకొండ, మిడ్జిల్, దేవరకద్ర, సీసీ కుంట, కౌకుంట్ల మండలాలలో రేపు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనున్న రెండో విడత ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ డి. జానకి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బీఎన్ఎస్ 163 (144 సెక్షన్) అమల్లో ఉండటంతో పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకు పైగా గుమికూడడం నిషేధం అని తెలిపారు. నేటి సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు సైలెంట్ పీరియడ్ అమల్లో -మిగతా4లో..

---

## ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు

**ముగిసిన రెండో విడత ఎన్నికల ప్రచారం**

**ఓట్ల లెక్కింపు ముగిసే వరకు మద్యం దుకాణాలను మూసివేయాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** జిల్లాలో ఈనెల 14వ తేదీన రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆయా మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత ఎటువంటి ప్రచారం నిర్వహించడానికి అనుమతి లేదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. రెండో విడత ఎన్నికలు జరిగే వనపర్తి, కొత్తకోట, మదనాపూర్, ఆత్మకూరు, అమరచింత ఐదు మండలాల పరిధిలో నేటి సాయంత్రం 5:00 గంటల (17:00 గంటల) వరకు మాత్రమే అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముగించాలని స్పష్టం చేశారు. ఆ తర్వాత ఎటువంటి బహిరంగ ప్రచారానికి అనుమతి ఉండదని తెలిపారు. సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం ఈ ఐదు మండలాల్లో నిషేధాజ్ఞలు శుక్రవారం సాయంత్రం 5 గంటల నుండి అమలులోకి వస్తాయని -మిగతా4లో..

---

## ఎన్నికల విధులకు గైర్హాజరైన అధికారులపై చర్యలు

**మహబూబ్‌గర్ కలెక్టర్ విజయేంద్ర బోయి**

**మహబూబ్‌గర్ డిసెంబర్ 12, ప్రభాతవార్త:** మహబూబ్‌గర్ జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల విధులకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేంద్రబోయి తెలిపారు. జిల్లాలో 423 గ్రామపంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిందని, ఇందులో ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అదర్ పోలింగ్ ఆఫీసర్స్ ను ఎన్నికల విధులు నిర్వర్తించేందుకుగాను ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. అయితే 11న జరిగిన మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికల విధులకు గైర్హాజరైన పిఒ, ఓపిఒ లపై ఎన్నికల నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కాబట్టి రెండవ దశ మూడో దశలో జరగబోయే పంచాయితీ ఎన్నికల విధులకు అధికారులు గైర్హాజరయితే క్రమశిక్షణ రైతంగా ప్రవర్తిస్తే ఎన్నికల విధులు నిర్వర్తించడంలో అలసత్యం నిర్లక్ష్యం వహించిన ఎడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

---



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

- మాదారం గ్రామాన్ని అన్ని విధాలా ముందుంచుతాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 12ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి,సంక్షేమం,ప్రతి ఇంటి పురోగతి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.సర్పంచ్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మాదారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్‌గౌడ్‌కు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ మాదారం గ్రామాభివృద్ధికి యువకుడు,అందరినీ కలుపుకొని అభివృద్ధి చేయాలనే చిత్త శుద్ధి ఉన్న సుదర్శన్ గౌడ్‌ను గెలిపించాలంటూ -మిగతా4లో..

---

## కొడుకు విజయం..తండ్రి మరణం

**కొన్ని గంటలైనా దక్కని ఆనందం**

**కన్నీటి పర్యంతమైన జకినాలపల్లి**



పార్థీవదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**ఊర్కొండ,డిసెంబర్12 ప్రభాతవార్త:** కన్న కొడుకు ప్రయోజకుడవుతుంటే, కొడుకు సాధించిన విజయాలను వెన్నంటి ఉండి భుజము తట్టి ముందుకు నడిపించిన తండ్రి కొడుకు విజయాన్ని చూడకుండానే కన్ను మూసిన యదార్థ ఘటన ఉరుకొండ మండలం జకినాలపల్లిలో గ్రామంలో చోటు చేసుకుంది. మొదటి విడత ఎన్నికలలో ఊరుకొండ మండలం జకినాలపల్లి గ్రామ సర్పంచ్‌గా బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో కదిరే శేఖర్ యాదవ్ బరిలో నిలిచారు. కదిరే శేఖర్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో ఉండగా తన తండ్రి కదిరే సాయిలు ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుండి జారిపడి గత వారం రోజుల కింద ప్రమాదానికి గురయ్యారు. గత వారం రోజులుగా కదిరే సాయిలు - మిగతా4లో..

---

## అప్పులు పుట్టక.. ఉన్న పొలం అమ్మలేక..

**సర్పంచ్ అభ్యర్థులకు కరెన్సీ కష్టాలు**

- చేతిలో నగదు లేక అవస్థలు
- అమ్మకానికి స్థిరాస్తులు..
- పైసా పుట్టక తీవ్ర ఆందోళన
- భూములు కుదువ పెడుతున్న వైనం



**ఉప్పునుంతల, డిసెంబరు 12 ప్రభాతవార్త** రాజకీయ పార్టీలకతీతంగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు జెండాల నీడలోనే సాగుతున్నాయి. పార్టీల నాయకులు, పార్టీ సానుభూతిపరులు, పోటీలో నిలిచారు. అక్కడ వరకు బాగానే ఉన్నా కానీ పోటీ చేసే అభ్యర్థులకు కరెన్సీ కష్టాలు వెంటాడుతున్నాయి. పోటీ చేసే అభ్యర్థులకు చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు పడుతున్నారు.పల్లెల్లో ముఖ్యంగా ఈపరిస్థితి అత్యంత దారుణంగా మారింది.రాజకీయ పార్టీలైతే ప్రోత్సహిస్తున్నాయి కానీ కరెన్సీకి గ్యారెంటీ ఇవ్వడం లేదు. రాజకీయాలంటే మక్కువ ఉన్నవారు ఏదో విధంగా డబ్బులు సమకూర్చుకుంటుండగా మరి కొందరైతే నేతలపై భారం వేసుకుని ఉన్నారు. ప్రతి గ్రామంలోను పోటీ అనివార్యమైన చోట హోరా హోరి ప్రచారం నడుస్తుంది. పోలింగ్ కు కేవలం 4 రోజులే ఉండడంతో ఓటర్లను తమ



బుట్టలో వేసుకునేందుకు నయానో ...భయానో తమ వైపు తిప్పుకునేందుకు పైసలతో ముడిపడింది.దీంతో డబ్బులు చేతిలో సరిపడా స్థాయిలో అందుబాటు లేక గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు. అంది వచ్చిన అవకాశాన్ని చేజిక్కించుకునేందుకు ఎంతైనా సరే తెగించేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. డబ్బులు పోగు చేసుకునేందుకు అప్పుల కోసం తిరుగుతూ వారికి ఎక్కడికి వెళ్ళినా చేదు అనుభవమే ఎదురవుతుంది. పెద్ద పెద్ద గ్రామ పంచాయతీలలో లక్షల వ్యయంతో జరుగుతుంది. ఈసారి భూమి పేపర్లు కుదువ పెట్టి అప్పులు తెచ్చుకుంటున్నారు. అప్పులు ఇచ్చే వారికి సర్పంచ్ ఎన్నికలు భారీ స్థాయిలో ఆదాయాన్ని సమకూరుస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత రాజకీయంగా ప్రభావితం చేసి రుణాలు కట్టకపోతే తమ పరిస్థితి ఏంటి...? అన్న కోణంలో కొంతమంది వడ్డీ వ్యాపారులు మొఖం చాటేస్తున్నారు.

---

## ఇప్పటికైనా ఒక్క తాటిపైకి రావాలి

- రెండవ, మూడవ విడత ఎన్నికల్లో సత్తా చాటాలి
- బీఆర్ఎస్ బీజేపీ మధ్య చీకటి ఒప్పందం
- రంగారెడ్డి గూడలో బీఆర్ఎస్‌కు వచ్చింది 13 ఓట్లే
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల,డిసెంబర్ 12, ప్రభాతవార్త :** ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒక్క తాటిపైకి రావాలని, రెండవ, మూడవ విడత ఎన్నికల్లో సత్తా చాటాలి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సూచించారు. తొలి విడత పంచాయితీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సింగిల్ గా పోటీ చేసారని, అయితే బీఆర్ఎస్, బీజేపీ లోపాయికారీగా ఒక్కటై పోటీ చేసాయని ఎమ్మెల్యే విమర్శించారు. తన సొంత గ్రామం రంగారెడ్డిగూడలో కేవలం 13 ఓట్లు మాత్రమే సాధించిన బీఆర్ఎస్ నాయకులకు తనను విమర్శించే హక్కు ఎక్కడిదని నిలదీసారు. రంగారెడ్డిగూడ ఒక్కటే తన ఊరుకాదని, నియోజకవర్గంలో ఉన్న అన్ని ఊర్లూ తనవేనని పేర్కొన్నారు. తొలివిడత ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా 50శాతానికి పైగా పంచాయితీల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగా బీఆర్ఎస్ చాలా చోట్ల కనీసం అభ్యర్థులను కూడా పోటీలో పెట్టలేకపోయిందని విమర్శించారు. తొలి విడత పంచాయితీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాజాపూర్ మండలంలోని తన సొంత గ్రామం రంగారెడ్డి గూడలో బీజేపీ అభ్యర్థి గెలవడాన్ని ఎమ్మెల్యేగా తన ఓటమి అంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని తప్పు పట్టారు. రంగారెడ్డిగూడలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి కేవలం 13 ఓట్లు మాత్రమే వచ్చాయని గుర్తు చేసారు. గతంలో లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సమయంలో ఆయన సొంత గ్రామం ఆవంచలో బీఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ 560 ఓట్ల మెజారిటీతో గెలుపొందలేదా? అని ప్రశ్నించారు. అలాగే లక్ష్మారెడ్డి మంత్రిగా కొనసాగుతున్న సమయంలో కావేరమ్మపేట సర్పంచ్ గా బుక్కా వెంకటేశం గెలిచారని గుర్తు చేసారు. రంగారెడ్డి గూడ తన సొంత గ్రామం అని అక్కడ ఎవరు గెలిచినా వారు తన వాళ్లేనని స్పష్టం చేసారు. ప్రస్తుతం రంగారెడ్డి గూడలో సర్పంచ్‌గా గెలిచిన ఆనంద్ (రేవతి) గతంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయారని ఆ సానుభూతి కూడా ఈ ఎన్నికల్లో పని చేసిందని అభిప్రాయపడ్డారు. అదే విధంగా రంగారెడ్డిగూడకు రూ.3.50 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్, 90 లక్షలతో సీసీ రోడ్డు, దళితవాడలో రోడ్లు వేయించానని ఇలా ఎన్ని అభివృద్ధి పనులు చేసినా రంగారెడ్డిగూడ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీని అక్కడి నుంచి తొలగిస్తానని తాను రెండేళ్ల కిందట గ్రామప్రజలకు మాట ఇచ్చానని,అయితే ఈ అంశం కోర్టులో ఉన్న కారణంగా ఆ వాగ్దానాన్ని ఇప్పటికీ నెరవేర్చలేకపోయానని, ఈ అంశం గురించి కూడా రంగారెడ్డిగూడ గ్రామస్తులు తనపై అలిగి ఉండవచ్చునని పేర్కొన్నారు. రంగారెడ్డిగూడలో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని స్పష్టం చేసారు. రాజాపూర్ లాంటి కీలక పంచాయితీలో కూడా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని పోటీలో పెట్టలేకపోయిందని, అప్పటికే అక్కడ రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన రామకృష్ణ - మిగతా4లో..

---

## పోలింగ్ సామగ్రి పంపిణీకి ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలి

**ఎన్నికల సిబ్బంది అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న కలెక్టర్

**వనపర్తి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న మండలాల్లో పోలింగ్ సిబ్బందికి గందరగోళం లేకుండా పోలింగ్ సామాగ్రి పంపిణీకి ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత మండలాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి శుక్రవవారం వనపర్తి, కొత్తకోట మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలలో సందర్శించారు. పోస్టల్ బాలెట్ పోలింగ్ కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు, సిబ్బంది విధుల నిర్వహణను, పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. అదేవిధంగా వనపర్తి, కొత్తకోట మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాలతో పాటు, మదనాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణల్లో శనివారం రెండో విడత ఎన్నికల పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న వనపర్తి, కొత్తకోట, మదనాపూర్, ఆత్మకూరు, అమరచింత మండలాల్లో పోలింగ్ సిబ్బందికి గందరగోళం లేకుండా పోలింగ్ సామాగ్రి పంపిణీకి ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బృందాలు, గ్రామ పంచాయతీల వివరాలతో రూట్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట కల్లా ఇబ్బందికి సామాగ్రి పంపిణీ ప్రక్రియతో పాటు, లంచ్ పూర్తి చేసి రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెండో విడతలో పోలింగ్ జరగనున్న ఐదు మండలాల్లో డిసెంబర్ 12వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ఎలాంటి ప్రచారం కానీ, ఓటర్ స్లిప్పుల పంపిణీ కానీ చేయడం

## వ్యక్తిత్వ వికాస శిక్షకుడిని కలిసిన శాంతినగర్ సేవా సమితి సభ్యులు

**వడ్డేపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** వడ్డేపల్లి మండల కేంద్రం శాంతినగర్ శ్రీ క్రిష్ణ చైతన్య స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిత్వ వికాస శిక్షకుడు సంద్ర సుధీర్ ని శుక్రవారం శాంతినగర్ సేవా సమితి వడ్డేపల్లి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, మాలిక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సేవా సమితి ద్వారా ప్లాస్టిక్ పై చేస్తున్న పోరాటం గురించి వారికి వివరించారు. అలాగే సుధీర్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి జరిగే నష్టాలు తన స్పీచ్ ల ద్వారా ప్రజలకు తెలియజేయాలని, ప్లాస్టిక్ లేని సమాజం నిర్మితం కావాలని వారు కోరారు. దానికి సుధీర్ ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు విస్తృతం గా తన స్పీచ్ ల ద్వారా ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు. శిక్షకుడు సేవా సమితి సమితి ద్వారా చేస్తున్న కార్యక్రమాలు తెలుసుకొని వారిని అభినధించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు శిక్షకుడి ని శాలువాతో సన్మానం చేసి, పలు రకాల బట్ట సంచులు బహుమతిగా ఇచ్చారు.



వ్యక్తిత్వ వికాస శిక్షకుడిని సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

## నేడు ప్రచారంలో పాల్గొననున్న నాయకులు

**ఉప్పునుంతల, డిసెంబరు 12 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా నేడు శనివారం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచుల అభ్యర్థుల గెలుపు కోసం తమిళనాడు ఏఐసీసీ పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పర్యటిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో ఉదయం 8 గంటలకు,9 గంటలకు లక్ష్మాపూర్, ఉదయం 9.30 గంటలకు పెద్దాపుర్ ,10.30 గంటలకు మొల్గర, ఉదయం 11.00 సదగోడు గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు తిరుమలాపూర్, మధ్యాహ్నం1.00 గంటలకు కొరటికల్, మధ్యాహ్నం 2 రెండు గంటలకు తిప్పాపూర్, మధ్యాహ్నం 2.30 గంటలకు తాడూరు, మధ్యాహ్నం 3.30 గంటలకు రాయిచేడ్, సాయంత్రం 4.30 గంటలకు సూర్య నాయక్ తండా , సాయంత్రం 5 గంటలకు పెనిమిళ్ళ, సాయంత్రం 6 గంటలకు సి.బి తాండ,7 గంటలకు గువ్వలోని పల్లి ,సాయంత్రం 7.30 నిమిషాలకు, రాత్రి 8 గంటలకు ఈరట్వాన్ పల్లి,8.30 గంటలకు అయ్య వారి పల్లి లో నిర్వహిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు.

## పల్లెల్లో జోరందుకున్న ఎన్నికల ప్రచారం

**పెబ్బేర్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలో మూడో విడత గ్రామ సర్పంచ్ ఎన్నికలలో భాగంగా అభ్యర్థులు ఒకరికి మించి ఒకరు ఎత్తులకు పై ఎత్తులతో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి హేమలత కృష్ణారెడ్డి మాట్లాడుతూ తను గ్రామం కోసం 40 సంవత్సరాల నుంచి కృషి చేస్తున్నానని విద్య, వైద్యం కోసం ఎవరు వచ్చి తనను అడిగిన వెంటనే స్పందించి సహకరిస్తున్నానని అలాగే మా గ్రామంలో ఎవరు చనిపోయిన ప్రతి ఒక్కరికి కులం మతాలకతీతంగా తక్షణ సాయంగా రూ. 5000 అందిస్తున్నానని, పేద విద్యార్థుల అండగా చదువులకు, ఆరోగ్యం బాగా లేకపోయినా వెంటనే ఆర్థిక సహాయం చేస్తున్నానని. 64 మంది వృద్ధ దంపతులకు 60 సంవత్సరాలు పైబడిన వారికి బట్టలు పెట్టి ఒడిబియ్యం అందజేశానని అలాగే గ్రామంలో వాల్మీకి విగ్రహం, గంగమ్మ తల్లి, భగీరథ విగ్రహాలు పెట్టడానికి కృషి చేశానని చింతల వెంకటేశ్వర దేవాలయ పునరుద్ధరణకు తన వంతు కృషి ఇక ముందు కూడా నిరంతరం నా వంతు కృషిగా రంగాపురం గ్రామ అభివృద్ధికి సిసి రోడ్లు గాని, డ్రైనేజీ గాని, తాగునీటి సౌకర్యం, వీధిలైట్లు తప్పనిసరిగా అందిస్తానని రంగాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థి హేమలత కృష్ణారెడ్డి తెలియజేశారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి

## గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభంజనం

**గద్వాల టౌన్ డిసెంబర్ 12, ప్రభాతవార్త:** గద్వాల నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గెలిచి ఘన విజయం సాధించారు. నియోజక వర్గంలో నాలుగు మండలాలలో 106 గ్రామ పంచాయతీలకు మొదటి విడత ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో కాంగ్రెస్: 78, బిఆర్ యస్: 09: బీజేపీ 09: స్వతంత్ర అభ్యర్థులు 10 మంది గెలుపొందారు. గద్వాల మండలంలో 28 గ్రామపంచాయతీలు వుండగా కాంగ్రెస్: 25బీఆర్ఎస్:0బిజెపి :0స్వతంత్ర :03ఇతరులు :0 గెలుపొందగా గట్టు మండలంలో 27 గ్రామపంచాయతీలు వుండగా కాంగ్రెస్: 18, బీఆర్ఎస్:05బిజెపి :0, స్వతంత్ర :04ఇతరులు :0 గెలుపొందారు. కేటీ దొడ్డి మండలంలో గ్రామపంచాయతీలు 23 వుండగా కాంగ్రెస్: 17, బీఆర్ఎస్:02బిజెపి :02,స్వతంత్ర :02ఇతరులు :0 గెలుపొందారు. ధరూర్ మండలంలోని 28 గ్రామపంచాయతీలు వుండగా కాంగ్రెస్: 18, బీఆర్ఎస్:02,బిజెపి :07,స్వతంత్ర : 01గెలుపొందారు.

## తపోవన్ హైస్కూల్లో విద్యార్థుల నేతృత్వంలోని సమావేశాలు

**దేవరకద్ర,డిసెంబరు 12 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలోని డోకూర్ సమీపంలో గల తపోవన్ పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ అంటే విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో తమ విద్య పురోగతి, బలాలు బలహీనతలు, లక్ష్యాల గురించి చర్చించడానికి స్వయంగా నిర్వహించే సమావేశం. దీనిలో తపోవన్ విద్యార్థులు తమ పనిని అభ్యాస ప్రయాణాన్ని ప్రదర్శిస్తారు. వారి అభ్యాసానికి వారే బాధ్యత వహించేలా ప్రోత్సహిస్తుంది. ఇది విద్యార్థి కేంద్రీకృత విధానం. అదేవిధంగా విద్యార్థులచే తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం లకు సంబంధించి వివిధ అంశాల పట్ల ప్రతిభ పాఠవాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వర్కుటి నిరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రయ్య, నరసింహులు, రవి, శ్రీనివాసులు, ఇక్బాల్ పాషా, తిరుపతయ్య, కురుమూర్తి, స్వామి, నాగరాజు, అనురాధ, ఉమా, సబిహా బేగం, ఉమా, పావని, సరిత, అనిత,భవాని, స్వప్న, శిరీష, కరిష్మా, మౌనిక, లత, గౌతమి, శ్రావణి, సరిత తదితరులు పాల్గొన్నారు.


ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

## ఎంజె4 కెనాల్ కోసం కలెక్టరేట్ ముట్టడిస్తా

### హరిజన వాడ మీదుగా జమ్ముల తాండా రోడ్డు పూర్తి చేస్తా

**వనపర్తిరూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** రెండవ విడత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సవాయిగూడెం,పెద్దగూడెం తాండా, పెద్ద గూడెం, కదుకుంట్ల గ్రామాలలో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సవాయి గూడెం గ్రామములో నియంత పాలనకు చరమగీతం పాడాలని రామాలయ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. రెండేళ్లుగా గ్రామములో ఎటువంటి అభివృద్ధి జాగలేదని నాయకుల పెత్తనంకోసం గ్రామంలో కలహాలు సృష్టించి పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. శ్రీలతను గెలిపిస్తే గ్రామ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో రైతాంగం ఎరువుల కోసం రోడ్లు ఎక్కే పరిస్థితి వచ్చిందని సకాలంలో పంటలు చేతికి రాక రైతులు తీవ్రంగా నష్టపోయిరని అన్నారు. గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ నిర్వీర్యం చేసిందని గ్రామాలు అభివృద్ధి, పచ్చదనం పరిశుభ్రత ఉండాలంటే బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. గ్రామాలలో ఓట్లు అడగడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను మహిళలకు రూ.2500లు, వృద్ధులకు రూ. 4 వేలు, తులం బంగారం,కెసిఆర్ కిట్టు, కంటివెలుగు, విద్యార్థినులకు స్కూటీలు, ధాన్యానికి బోనస్, గ్యాస్ సబ్సిడీ, రైతులకు రైతు భరోసా, రైతు రుణ మాఫీ, రైతు బీమా, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు ఏమైనాయని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, కె.మాణిక్యం, విజయ్ కుమార్, ధర్మా నాయక్, గంధం పరంజ్యోతి, శివన్న, చిట్యాల రాము, మాజీ కౌన్సిలర్స్ బండారు కృష్ణ,ఉంగ్లం తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, స్టార్ రహీమ్, డా. డ్యానియల్, జోహెబ్ హుస్సేన్, మంద రాము, నందిమల్ల అశోక్, జిల్లా మీడియా కన్వీనర్ పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి

## చివరి రోజు ప్రచారంలో పాల్గొన్న ప్రముఖులు

**ఆత్మకూర్ డిసెంబర్ 12,ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 14న రెండవ విడత ఎన్నికలు జరగనున్న ఉమ్మడి ఆత్మకూరు మండలంలో చివరి రోజున శుక్రవారం రోజు మరి ఆత్మకూరు మండలంలో అధికార పార్టీ కాంగ్రెస్ మరియు ప్రతిపక్ష పార్టీ టిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ప్రముఖులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రాకట్టంగా గ్రామాలను అభివృద్ధి చెందాలంటే అధికార పార్టీల పరిచిన అభ్యర్థులకు ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలంటూ ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండలం పార్టీ అధ్యక్షులు రమేష్ పట్టణ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు తదితరులు కరివేనా బాలకృష్ణాపూర్ తదితర గ్రామాలలో విస్తృతంగా తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతిపక్ష టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఆత్మకూరు మండలం పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ ఆత్మకూరు మాజీ మండల పరిషత్ అధ్యక్షులు బంగారు శ్రీనివాసులు రేచింతల సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీ ్మకాంత్ రెడ్డి తదితరులు శుక్రవారం రోజు మండలంలోని రేచింతల మరియు బాలకిస్టాపూర్ పింఛన్ల తదితర గ్రామాలలో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి ప్రజావ్యతిరేక వితనాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలు మాత్రం గుబ్బనంగా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులకు కార్యకర్తలకు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం ఆయా పార్టీల తరఫున ప్రచారం నిర్వహిస్తున్న నాయకులకు పాలు పోయడం లేదంటూ ఒక క్రింద ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆదివారం జరగనున్న ఎన్నికల నేపథ్యంలో శనివారం రోజు ప్రజలకు పంచే మందు మరియు నగదు బదిలీలపైనే బరిలో నిలిచిన అభ్యర్థులు లెక్కలు వేసుకుంటూ ప్రచారం కొనసాగిస్తుండడం విశేషం.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు కార్యకర్తలు

## నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ హవా

**నారాయణపేట, డిసెంబరు 12 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో జరిగిన తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. పోలింగ్ ముగిసిన వెంటనే సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాలను అధికారులు ప్రకటించారు. మొత్తం 67 సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగగా, కాంగ్రెస్ 55 స్థానాలు కైవసం చేసుకోగా, టీఆర్ఎస్ 10, బీజేపీ 2 స్థానాలను గెలుచుకున్నట్లు అధికారులు తెలిపారు. ఏ ఒక్క సర్పంచ్ స్థానంపైనా ఫలితాలు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి రాలేదని స్పష్టం చేశారు. ఫలితాలు వెలువడిన వెంటనే కాంగ్రెస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా భారీగా సంబరాలు చేసుకున్నాయి. అన్ని మండలాల్లోనూ పోలింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా శాంతియుతంగా ముగిసిందని జిల్లా అధికారులు పేర్కొన్నారు. తొలి విడతలో పోలింగ్ శాతం 84.58 గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లాలో మొత్తం పోలింగ్ 84.58 శాతం నమోదైంది. గుండుమల్, కోస్గి, కొత్తపల్లి, మద్దూరు మండలాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ నిర్వహించారు.జిల్లాలో మొత్తం 66,689 మంది ఓటర్లలో 56,403 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లు: 34,146 ఓటేసిన వారు: 27,837పురుష ఓటర్లు: 32,540 ఓటేసిన వారు: 28,566మండలాల వారీగా పోలింగ్ వివరాలుగుండుమల్ మండలం:మొత్తం ఓటర్లు: 15,534ఓటు వేసిన వారు: 12,903పోలింగ్ శాతం: 83.06 కోస్గి మండలం:మొత్తం ఓటర్లు: 16,805ఓటు వేసిన వారు: 14,570పోలింగ్ శాతం: 86.7 (జిల్లాలో అత్యధికం)కొత్తపల్లి మండలం:మొత్తం ఓటర్లు: 12,753ఓటు వేసిన వారు: 10,466పోలింగ్ శాతం: 83.17 మద్దూరు మండలం:మొత్తం ఓటర్లు: 21,597ఓటు వేసిన వారు: 16,552నాలుగు మండలాలు కలిపి తొలి విడతలో పోలింగ్ శాతం 84.58 గా నమోదై, ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని అధికారులు తెలిపారు.

## గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా : ప్రచారంలో అభ్యర్థులు

**ఉప్పునుంతల,డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఈనెల 17న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల జోరు మండలంలో ఇంటింటి ప్రచారం జోరు అందుకుంది.కాంగ్రెస్,బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు ఇంటింటికి తిరిగి తమకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో గ్రామ సర్పంచ్ అభ్యర్థి చింత గాళ్ళ శ్రీనివాసులు ఇంటింటికి తిరిగి తమకు అవకాశం కల్పించాలని ఓటర్లను కోరుతున్నారు.కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన అభ్యర్థి చింతగాళ్ళ శ్రీనివాసులు ప్రజా పాలన పట్ల అవగాహన ఉన్న వ్యక్తి కావడంతో సర్పంచిగా ఎందుకంటే గ్రామాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తామని నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టఅనంతరెడ్డి,మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి లు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. యువకుడు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధే లక్ష ్యంగా పనిచేసే ప్రవర్తన గల వ్యక్తిని మనం సర్పంచ్ గా గెలిపిం చుకుంటే గ్రామంలో ఎటువంటి సమస్యలున్న నేరుగా ప్రజలు వినడానికి వీలుంటుందని వారు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తమకు ఒక్కసారి అవకాశం కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఆలూరి పర్వతాలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం వేళల్లో సర్పం చ్ అభ్యర్థులకు కొంత అంతరాయం ఏర్పడుతుంది. అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆశీర్వాదంతో గ్రామాలను అభివృద్ధిపరిచే లక్ష ్యంతో పని చేస్తామని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు ఇంటింటికి తిరిగి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.


ఉప్పునుంతల లో కాంగ్రెస్ లో చేరికలు

## ముగిసిన ఎన్నికల ప్రచారం.. ప్రలోభాలకు తెర

**చిన్నచింతకుంట, డిసెంబరు 12 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీల ఎన్నికల ప్రచారం శుక్రవారంతో ముగిసింది.ఈనెల 7నుంచి ప్రారంభమైనఎన్నికల ప్రచారం శుక్రవారం ఐదు గంటలకు ప్రచారం ముగిసింది. మండలంలో 18 గ్రామ పంచాయతీలకు గాను 59 మంది సర్పంచులకు పోటీ చేసిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇంటింటి ప్రచారాలు, మైకులతో ప్రచారాలు నిర్వహిస్తూ తమకు కేటాయించిన గుర్తులను ఓటర్లకు చూయిస్తూ గ్రామాభివృద్ధి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని, గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపడతామని హామీలు ఇస్తూ ,తమ మద్దతుదారులతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తమ అభ్యర్థులకు ఓట్లువేస్తే గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధిచేస్తామని హామీ ఇస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. శుక్రవారం అమ్మాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాలలోని ఆయా వార్డులలో పోటీ చేసే అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఇంటింటికి వెళ్లి తమకు ఓటు వేయాలని ఒట్టు వేసుకుంటున్నారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో ప్రలోభాలకు తెరలేపారు.ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మద్యం, నగదు పంపిణీ చేసేందుకు రహస్య ప్రదేశాలలో నిల్వలు చేశారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ కొనసాగుతుంది.మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. సాయంత్రానికి సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలిచిన వారిని ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.


అమ్మాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## జిల్లాస్థాయి ఇండియా ఉమెన్స్ షూటింగ్ బాల్ క్రీడలు

**మక్తల్ టౌన్,డిసెంబరు 12 ప్రభాతవార్త :** షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్ రాజ్ తోమర్, తెలంగాణ షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి సిహెచ్. ఐలయ్య ఆదేశాల మేరకు నవంబర్ 16న ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా స్థాయి ఆస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ షూటింగ్ బాల్ గద్వాల ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలలో నారాయణపేట జిల్లా మహిళలు పాల్గొని ప్రథమ స్థానం పొంది ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా షూటింగ్ బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన మహిళలు: దివ్య, ప్రవీణ, స్రవంతి, శ్రీజ, అనూష (నారాయణపేట జిల్లా) ఫైజా, అఖిల, రాధిక, లక్ష్మీ ్మ ప్రసన్న, అజీర (గద్వాల జిల్లా) గాయత్రి పల్లవి ( నాగర్ కర్నూలు జిల్లా) రాజేశ్వరి, స్నేహ( మహబూబ్ గర్) వసుద ( వనపర్తి) వీరందరూ రాష్ట్రస్థాయి అస్మిత కేలో ఇండియా ఉమెన్స్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి మహబ్ నగర్ జిల్లా చైర్మన్ బి.గోపాలం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన మహిళలు ఈనెల 13, 14 తేదీలలో వికారాబాద్ జిల్లా తాండూర్ సెయింట్ మార్క్స్ హైస్కూల్లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని బి.గోపాలం తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహిళల జట్టుకు కోచ్‌లుగా పీఈటీలు మంజునాథ్ ఋషి గద్వాల, రమేష్ కుమార్ నారాయణపేట, జట్టు మేనేజర్ గా టి.అంకిత ఫిజికల్ డైరెక్టర్ నర్వ గురుకుల పాఠశాల వ్యవహరిస్తారని బి.గోపాలం తెలిపారు. రాష్ట్రస్థాయి అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మహిళలను గద్వాల్ డివైఎస్ఓ కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం, కె.ప్రభాకర్, వీర వసంత రాయుడు, జిల్లాల సంఘ బాధ్యులు మంజునాథ్, రమేష్ కుమార్, రాఘవేందర్,పిడి, పిఈటిలు, విద్యార్థులు అభినందించారు.


షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన మహిళలు

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

### కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం, మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే

**వనపర్తి ప్రతినిధి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపిస్తేనే గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. రెండవ విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వనపర్తి మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అప్పాయిపల్లి, కీర్యతండా, కాశీంనగర్, కాశీంనగర్ తాండ, చిట్యాల పెద్దగూడెం, దత్తాయిపపల్లి, చందపురం, మెంటేపల్లి, కదుకుంట్ల, కిష్టగిరి, కిష్టగిరి తాండ, పెద్దగూడెం తాండ, నాచ హళ్లి తో పాటు పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మరో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ప్రస్తుతం మూడేళ్లు తాను ఎమ్మెల్యేగా, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా, మల్లు రవి ఎంపీగా ఉంటారని గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులనే అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జడ్పీటిసి గొల్ల వెంకటయ్య, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


బ్యాలెట్ బాక్సును తీసుకెళ్తున్న సిబ్బంది

## పంచాయతీ ఎన్నికలకు.. బ్యాలెట్ బాక్సులు, సామగ్రి సిద్ధం

చిన్న చింతకుంట, డిసెంబరు 12 ప్రభాతవార్త : గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు గాను మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 174 పోలింగ్ స్టేషన్ లో బ్యాలెట్ బాక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ లలో ఎన్నికల అధికారులను నియమించారు. పోలింగ్ స్టేషన్ లో మౌలిక వసతులను ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశార . మండలంలోని అన్ని గ్రామాలలో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ పంచాయతీలకు సంబంధించిన ఎన్నికలు డిసెంబర్ 14న నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.


గోవర్ధన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆనంద్‌గౌడ్

## బాధిత కుటుంబానికి భరోసా

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 12,ప్రభాతవార్త :** బాధిత కుటుంబాలకు నేనున్నానంటూ భరోసానిచ్చారు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్. వీరన్నపేటకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త మేదరి సత్యం చిన్నాన్న కుమారుడు స్వర్గీయ గోవర్ధన్ (48) పరమపదించిన విషయం తెలుసుకుని వీరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులకు తన సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబానికి అవసరమైన సమస్త సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## వ్యక్తిపై కేసు నమోదు

**శ్రీరంగాపూర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** ఈనెల 11 గురువారం రోజు సాయంత్రం సమయంలో కంబలపురం గ్రామానికి చెందిన నాగేష్ కంబాలపురం గ్రామ శివారులో కరెన్న తిప్ప దగ్గర నుండి తన గ్రామమైన కంబాలపురంనకు బైక్ మీద వెళుతుండగా అతని వెనక నుంచి శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాఘవేంద్ర అనే వ్యక్తి తన పల్సర్ బైక్ తో అతివేగంగా నడుపుకుంటూ వచ్చి నాగేష్ బైకును ఢీకొట్టడం జరిగింది. ప్రస్తుతం నాగేష్ హైదరాబాద్ నాంపల్లి లో గల కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షి అయిన మేకల లక్ష ్మయ్య దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్సై హిమబిందు తెలిపారు.

## నూతన సర్పంచులకు ఘన సన్మానం


గెలిచిన అభ్యర్థులను సన్మానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

### గెలిచిన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి

**వనపర్తి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** మొదటి విడత సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన 34 మంది సర్పంచులను, వార్డు సభ్యులను శుక్రవారం సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆయన నివాసంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి అద్భుతమైన విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అధికార పార్టీ అరాచకాలకు, దౌర్జన్యాలకు ఎదురొడ్డి వీరోచితంగా పోరాడిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై ఉన్న వ్యతిరేకత ఈ ఎన్నికలలో ప్రస్ఫుటించిందని రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వము అని స్పష్టమైందన్నారు.గెలిచిన సర్పంచులు కష్టపడి పని చేసి ప్రజలమన్ననలు పొందాలని విజ్ఞప్తి చేశారు.రాబోవు ప్రభుత్వంలో అండగా ఉంటానన్నారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు,మండల అధ్యక్షులు,మాజీ ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ సోషల్‌మీడియా కన్వీనర్ నందిమల్లఅశోక్ పాల్గొన్నారు.

### నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలకు

## కట్టుదిట్టమైన బందోబస్తు


**వనపర్తి 4 ఆత్మకూరు1 మొత్తం**

**5 కేంద్రాల్లో 1340 మంది అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష**

**పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు**

**జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి**

**వనపర్తి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో నేడు (శనివారం) రోజున జరగనున్న జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష -2026 కోసం వనపర్తి జిల్లాలో 5 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1340 మంది విద్యార్థులు హాజరుకానున్నారని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. ఈ పరీక్షలు ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని ప్రశాంతంగా జరిగేలా సంబంధిత పోలీసు అధికారులకు భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవి, జిల్లాలో పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసుశాఖ సమగ్ర భద్రత ఏర్పాట్లు చేసింది. ప్రతి పరీక్షా కేంద్రంలో పోలీసు బందోబస్తు సిబ్బంది విధుల్లో ఉంటారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు స్వయంగా పర్యవేక్షిస్తారు. ప్రజలు పోలీసులకు సహకరించాలి, విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా పరీక్ష రాయాలని ఎస్పీ అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నేడు ఉదయం 08:00 నుండి సాయంత్రం 04:00 వరకు 163 బిఎన్ఎస్ఎస్ ( సెక్షన్ 144) సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడ వద్దని ఆమె సూచించారు.



## రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా


- ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల వరకు 163 బిఎన్ఎస్ (144 సెక్షన్) అమలు
- విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదు
- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి




**వనపర్తి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, మదనపూర్, అమరచింత మండలాల్లో ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అధికారికంగా ముగిసింది. ఆ సమయం తర్వాత ఎవరూ ప్రచారం చేయరాదని, డబ్బు, మద్యం బహుమతుల ద్వారా ఓటర్లను ప్రలోభపెట్ట కూడదని జిల్లా ఎస్పీ సునితరెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పట్ల ఓటు హక్కు పట్ల ఎన్నికల ప్రాముఖ్యత పట్ల పోలీసుశాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఓటర్లు, అభ్యర్థులు ఎన్నికల నియమావళికిలోబడి నడుచుకోవాలని కోరారు. ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేవారు వరుస క్రమంలో నిల్చుని వారి ఓటును ఉపయోగించుకోవాలని, వృద్ధులకు వికలాం గులకు ఓటు హక్కు ముందుగా వినియోగించుకునే అవకాశం కల్పించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా చెరవద్దు 100 మీటర్ల పరిధిలో ఓటు వేయమని అభ్యర్థించవద్దన్నారు. 200 మీటర్ల పరిధి టెంట్లు ఏర్పాటు చేయొద్దు, కరపత్రాలుపంచడం, గుర్తులు చూపడంలాంటివి చేయొద్దు, పోలింగ్ కేంద్రాల వద్దఓటర్లను ఇబ్బందులు పెట్టడంప్రలోభాలు గురిచేయడంలాంటివి చేయవద్దు. అపోహలు సృష్టించ కుండా, తప్పుడు సమాచారం ప్రచారం చేయకుండా ఉండాలి, సోషల్ మీడి యాపై జిల్లా పోలీసు శాఖ నిశిత పరిశీలన ఉన్నది, ఎవరైనా ఎన్నికల విధానానికి అటంకం కలిగిం చేలా ప్రవర్తించిన తప్పుడు సమాచారం ప్రచారం చేసిన అలాంటివారిపై చట్టపరమైన కఠిన చర్య లు తీసుకోవడం జరుగుతుందని ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే భవిష్యత్తులో ఎన్నికలు వచ్చే ప్రతిసారి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని యువత ఆదర్శంగా ఉండాలని సీఐ కోరారు. విజయోత్సవ ర్యాలీలకుబాణాసంచాకు, డీజేలకుఅనుమతి లేదన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి నట్లయితే చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.

## ప్రజల్లో రేవంత్ పాలనపై తీవ్ర వ్యతిరేకత

- బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ బాసు హనుమంతు నాయుడు



**గద్వాల టౌన్ డిసెంబర్ 12, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులను గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. శుక్రవారం మల్దకల్ మండలం తాటికుంట, దాసరపల్లి, గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిల గెలుపు కోరుతూ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, గత 10 ఏళ్లు కేసీఆర్ చేసిన అభివృద్ధి మళ్ళీ చేసి చూపిస్తామని ఆయనఅన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలనుమోసం చేసిందని ధ్వజ మెత్తారు. అందుకే ప్రజల్లో రేవంత్ పాలనపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీలో అభ్యర్థులు ఓట్లు అడగడానికి వెళ్తే గ్యారెంటీలపై నిలదీయాలన్నారు. రైతులు, సాధారణ ప్రజల మద్దతు బీఆర్ఎస్ వైపే ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు పార్టీ శ్రేణులు వివరించి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేఖర్ నాయుడు, మధుసూదన్, తిరుమలేష్, అవనిశ్రీ, వీరేష్ గౌడ్, రమేష్, మధు, బడేసాబ్, తిమ్మప్పగౌడ్, నరసింహులు, రవి, గోవిందు, వెంకటేష్, నరేష్, ఆంజనేయులు, రాజు, రామ్, రంగన్న, రాజేష్, కిషోర్, భాస్కర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పొగమంచులో వాహనాలు


## వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

- పాదచారులు రోడ్డుపై వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి
- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ సూచన




**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి - శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనదారులకు ప్రజలకు భద్రతా సూచనలు జారీ చేశారు. డ్రైవర్లు, వాకింగ్ చేసే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శీతాకాలం తీవ్రంగా ప్రారంభమైన నేపథ్యంలో, తెల్ల వారుజామున, రాత్రి సమయంలో పొగ మంచు (ఫాగ్) అధికంగా ఏర్పడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగే అవ కాశం ఉన్నందున వాహనదారులు ప్రజలకు భద్రతా సూచనలు విడుదల చేసినట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. పట్టణాలు-గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉదయం వాకింగ్ చేసే వారు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. పొగమంచు కారణంగా డ్రైవర్లకు ముందున్న వ్యక్తులు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

### వాహనదారులు పాటించాల్సిన సూచనలు



1. హెడ్‌లైట్లు, ఫాగ్ లైట్లు ఎప్పటికప్పుడు ఆన్‌లో ఉంచాలి. ఎక్కువ పొగమంచు ఉన్నప్పుడులో బీమ్ మాత్రమే వాడాలి.
2. వేగాన్ని నియంత్రించాలి; ఓవర్ స్పీడ్ పూర్తిగా నిషేధం.
3. ముందున్న వాహనానికి సురక్షిత దూరం తప్పనిసరిగా పాటించాలి.
4. రోడ్డుపై ఉన్న వైట్ మార్కింగ్ లైన్స్‌ను దాటి వెళ్లకూడదు.
5. అవసరమైనప్పుడు మాత్రమే డిప్పర్-హారన్ వాడాలి.
6. వాహనంలోని ఇండికేటర్లు, బ్రేక్ లైట్లు, వైపర్లు సరిగా పనిచేస్తున్నాయో ముందే చెక్ చేసుకోవాలి.
7. ఎదురువారిని బ్లైండ్ చేసే హై బీమ్ వాడకూడదు.
8. టైర్లు, బ్రేకులు, వాహనం మొత్తం కండిషన్ ముందుగానే పరిశీలించాలి.
9. రోడ్డు పక్కనవాహనాలను అవసరం లేకుండాఆపరాదు. ఆపాల్సి వస్తేపార్కింగ్ లైట్లు ఆన్ చేయాలి.
10. డ్రైవింగ్ సమయంలో నిద్రలేమీ, మద్యం సేవనం పూర్తిగా నిషేధం.

### వాకింగ్ చేసేవారు జాగ్రత్తలు తప్పనిసరి



1. ఉదయాన్నే పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో హైవేలు, ప్రధాన రోడ్లపై వాకింగ్ చేయడం ప్రమాదకరం.
2. డ్రైవర్లకు విజిబిలిటీ తగ్గినప్పుడు ముందున్న వ్యక్తులు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
3. వాకింగ్ చేయాల్సిన వారు గ్రౌండ్లు, కాలనీలు, పార్కులు వంటి సురక్షిత ప్రదేశాలను మాత్రమే ఉపయోగించాలి.
4. రోడ్డుపక్కన నడవాల్సినపరిస్థితిలోరెఫ్లెక్టివ్‌దుస్తులు లేదాలైట్ కలర్‌దుస్తులు ధరించడం మంచిది.
5. పిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు పక్కన వాకింగ్ చేయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రజలకు ఎస్పీ డి.జానకి సూచనలు "పొగమంచు ఎక్కువగా ఉండే ఉదయం 5 నుండి 8 గంటల వరకు, అలాగే రాత్రి 8 తర్వాత అనవసర ప్రయాణాలు చేయరాదని" సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణించవద్దని, కుటుంబ సభ్యులు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు."ప్రతి పౌరుడి ప్రాణ భద్రత మా ప్రాముఖ్యత. పొగమంచు సమయంలో తగ్గిన విజిబిలిటీ ప్రమాదాలకు దారి తీస్తుంది. డ్రైవర్లు, వాకింగ్ చేసే వారు ఇద్దరూ సూచనలు తప్పనిసరిగా పాటిస్తేనే ప్రాణాలను కాపాడుకోవచ్చు," అని ఎస్పీ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 / 112 కు వెంటనే సమాచారం అందించవచ్చని తెలిపారు.

## మార్చాల గ్రామ సర్పంచ్‌గా తలసాని కృష్ణారెడ్డి



సర్పంచ్‌గా తలసాని కృష్ణారెడ్డి



ఉప సర్పంచ్‌గా నిజాం సర్కార్

**కల్వకుర్తి, డిసెంబర్12ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో 257ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుడు తలసాని కృష్ణారెడ్డి గెలుపొందారు. హోరాహోరీగాసాగిన ఫలితాల్లో బీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి తలసాని కృష్ణారెడ్డి పైచేయిసాధించడంతో గ్రామంలో బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు సంబురాల్లో మునిగి తేలారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రామప్రజలు ఇంత మంచి అవకాశం ఇచ్చినందుకు గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని, చేసిన వాగ్దాలను అన్నింటిని నేరవేరుస్తానన్నారు. నా గెలుపుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు.

**గ్రామంలో మొదటి సారి మైనార్టీ ఉప సర్పంచ్ నిజాం సర్కార్...**

-103 ఓట్ల భారీ మెజార్టీతో 3వ వార్డు అభ్యర్థిగా గెలుపు...

గ్రామంలో ఎన్నో ఏళ్ళుగా సర్పంచ్ ఎన్నికలు నడుస్తున్నప్పటికి సర్పంచ్ పదవి, ఉప సర్పంచ్ పదవి మైనార్టీలకు అందని ద్రాక్షగా ఉన్నతరుణంలో నిజాంసర్కార్‌కు ఉప సర్పంచ్ పదవి దక్కడంతో మైనార్టీ కళ నేరవేరిందని మైనార్టీ సోదరులు పేర్కొంటున్నారు. గ్రామంలో 3వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుడిగా నిలిచిన నిజాం సర్కార్ 103 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొంది ఉప సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ నిజాం సర్కార్ మాట్లాడుతూ గ్రామంలో మొదటి సారి మైనార్టీలకు ఉప సర్పంచ్ పదవి దక్కడం చాలా సంతోష కరంగా ఉందన్నారు. నా గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి అందుబాటులో ఉండి వారి సమస్యల సాధనకై కృషి చేస్తానన్నారు. 3వ వార్డు నుంచి భారీ మెజార్టీతో గెలిపించి ఉప సర్పంచ్ పదవి దక్కడానికి కృషి చేసిన ప్రతి ఓటర్‌కు పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మూడో విడతకు పోటాపోటీ ప్రచారాలు

- ఏకగ్రీవం కోసం అధికార పార్టీ కాంగ్రెస్ యత్నాలు
- ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రయత్నం
- ఇప్పటికే కాంగ్రెస్ ఖాతాలో ఐదు సర్పంచుల ఏకగ్రీవాలు
- మిగిలిన 14 సర్పంచు పదవుల కోసం అభ్యర్థుల ఆర్భాటాలు



రావులపల్లిలో ప్రచారాన్ని సాగిస్తున్న సర్పంచి అభ్యర్థి కంపిలి వెంకటేష్



అన్నాసాగర్‌లో ప్రచారాన్ని ముమ్మరం చేసిన సర్పంచి అభ్యర్థి ఆల శ్రీకాంత్‌రెడ్డి

**భూత్పూర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** గ్రామ బాసుల పదవుల కోసం అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాలు సాగిస్తున్నారు. భూత్పూర్ మండ లంలోని 19గ్రామ పంచాయతీలు, 174వార్డు సభ్యుల పదవుల కోసం మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగనుండగా, ఇప్పటికే ఐదు సర్పంచుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఏకగ్రీవ సర్పంచు స్థానాలు ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షు లు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్‌ల చొరవ వల్ల కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లాయి. భూత్పూర్ మండలంలో ఐదుగురు సర్పంచులతో పాటు 44వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 14గ్రామ సర్పంచులు, 130వార్డు సభ్యుల ఎన్నిక కోసం మూడో విడతగా ఈ నెల 17న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫలితాలు ఇదేరోజు సాయంత్రం కల్లా తేటతెల్లమౌతాయి. ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ ఆయా గ్రామాలు, వార్డులలో అభ్యర్థుల హల్‌చల్ మొదలైంది. గ్రామాల్లో ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులునానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే ఐదు సర్పంచు స్థానాల్ని తమ ఖాతాలో వేసుకున్న అధికార పార్టీ కాంగ్రెస్ మరిన్ని స్థానాలు దక్కించుకుని మండలంలోని గ్రామ పంచాయతీలలో తన ప్రాభవాన్ని చాటుకునేందుకు కాంగ్రెస్ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ నేతలు తమ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకోసం ఆవిరళకృషి చేస్తున్నారనే చెప్పాలి. కాంగ్రెస్ బలంగా ఉన్న కొత్తమొల్గర, కప్పెట, పాతమొల్గర, మద్దిగట్ల, కరివెన, వెల్కిచర్లలతో పాటు మిగిలిన జీపీల సర్పంచు అభ్యర్థుల గెలుపునకు పాటు పడుతున్నారు. ఇక పదేళ్లపాటు అధికారం కొనసాగించి ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ గ్రామ పంచాయతీలలో తమ పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే ఆలతో పాటు పార్టీ నాయకులు విశేషంగా కృషిచేస్తున్నారు. బీఆర్ఎస్‌కు పట్టున్న పోతులమడుగు, అన్నాసాగర్, తాటిపర్తి, కొత్తూర్, హస్నాపూర్, శేర్పల్లిలతో పాటు మిగిలిన పంచాయతీలను కైవసం చేసుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. కాంగ్రెస్ బలపరిచిన కొత్త మొల్గర, మద్దిగట్ల, పాత, కొత్తమొల్గరలతో పాటు కప్పెట, వెల్కిచర్లలో సర్పంచి అభ్యర్థులు ప్రచార వేగాన్ని పెంచారు. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ బలపరిచిన పోతులమడుగు, అన్నాసాగర్, తాటిపర్తి, శేర్పల్లి, హస్నాపూర్ జీపీల సర్పంచి అభ్యర్థులు ముమ్మర ప్రచారాలు చేస్తున్నారు. ముఖ్యంగా అన్నాసాగర్‌లో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థి ఆలశ్రీకాంత్ రెడ్డి గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అవిరళ కృషి చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆల ఆదేశానుసారం పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు పార్టీ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళీధర్‌గౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మేకల సత్యనారాయణలు తమ పార్టీ బలపరిచిన సర్పంచి అభ్యర్థుల్ని గెలిపించుకునేందుకు నాయకులు ఆలుపెరగని ప్రచారం సాగిస్తున్నారు. ఇక పోతులమడుగు సర్పంచి బరిలో ఉన్న బీఆర్ఎస్ బలపరిచిన బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా మత్స్యకార సంఘం మాజీ అద్యక్షుడు మనెమోని సత్యనారాయణ తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పోతులమడుగులో మనెమోని సత్య నారాయణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేకల సత్య నారాయణ, తూము శ్రీనివాస్‌రెడ్డి, మొహ్మద్ సాధిక్ తో పాటు గ్రామ పెద్దలతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. రావుల పల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి కంపిలి వెంకటేష్ తనదైన శైలిలో గ్రామంలోని దాదాపు ఆరొందల మంది ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొత్తమొల్గర, కప్పెట, హస్నాపూర్ పాతమొల్గర, మద్దిగట్ల, వెల్కిచర్లలలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మరో నాలుగు రోజులలో జరిగే సర్పంచి, వార్డు సభ్యుల పదవుల కోసం జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం సమయాభావం వల్ల తమ తమ ప్రచారాల్ని వేగవంతం చేస్తున్నారని చెప్పక తప్పదు.

## 909 ఓట్ల మెజార్టీతో యాదయ్య విజయఢంక



సర్పంచ్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్‌లు



సర్పంచ్‌గా గెలుపొందిన యాదయ్య

**వంగూరు, డిసెంబర్12 ప్రభాతవార్త:** జరిగిన తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో వంగూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి పురుగుల యాదయ్య తమ ప్రత్యర్థి కాంగ్రెస్ బలపరిచిన బాదమోని రమేష్‌గౌడ్‌పై 909 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొంది, గ్రామంలోని 12 వార్డులకు గాను 11 వార్డులను క్లిన్ స్వీప్ చేసి అఖండ విజయాన్ని వంగూరు గ్రామ ప్రజలు యాదయ్యకు అందించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జరిగిన మొదటి విడత ఎన్నికలలో వంగూరు మండల కేంద్రానికి చెందిన యాదయ్యకు అందించిన మెజారిటీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. నిన్నటి వరకు కలిసికట్టుగా ఉండి అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గెలుపు కోసం అహర్నిశలు పనిచేసిన వారిలో చీలికలు ఏర్పడి ఎమ్మెల్యే బలపరిచిన అభ్యర్థిపై కాంగ్రెస్ సీనియర్ కార్యకర్తలు బలపరిచిన యాదయ్యకు గ్రామంలోని వివిధ కుల సంఘాలు, బిఆర్ఎస్, యువకులు మద్దతు తెలిపి వంగూరు మండలం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు జరిగిన ఎన్నికలలో ఇలాంటి మెజారిటీ ఎప్పుడు రాలేదని యాదయ్యకు 909 ఓట్ల మెజారిటీని అందించి వంగురు చరిత్రను తిరగరాశారు. జరిగిన ఎన్నికలలో వంగూరు జరిగిన ఎన్నికలలో వంగూరు గ్రామ ప్రజలు ఇలాంటి తీర్పును అందిస్తారని ఏ ఒక్కరు కూడా ఊహించలేదు. యాదయ్యకు ముదిరాజుల సన్మానం వంగూరు గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా ఎన్నికైన పురుగుల యాదయ్యను శుక్రవారం మండల కేంద్రంలోని ముదిరాజు సంఘం భవనంలో ముదిరాజు యువకులు ఆ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. అదేవిధంగా తన ప్యానల్‌లో గెలిచిన వార్డు సభ్యులకు సన్మానించారు. గ్రామ అభివృద్ధికై కట్టుబడి పని చేస్తానని తన గెలుపుకు సహకరించి కృషి చేసిన గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ రుణపడి ఉంటానని సర్పంచ్ యాదయ్య పేర్కొన్నారు.

## సర్పంచ్ స్థానాలను అత్యధికంగా కైవసం చేసుకున్న కాంగ్రెస్



శంకర్ కొండ సర్పంచ్ రవీందర్ నాయక్‌ను సన్మానిస్తున్న ప్రజలు

**వెల్దండ, డిసెంబర్12 ప్రభాతవార్త:** మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో 4 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాంగ్రెస్ కాగా, మిగిలిన గ్రామ పంచాయతీలకు గురువారం జరిగిన ఎన్నికలలో 19 గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ కైవసం చేసుకోగా 7 గ్రామ పంచాయతీలలో బిఆర్ఎస్ పార్టీ2, గ్రామపంచాయతీలలో స్వతంత్ర అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వెల్దండ సర్పంచ్‌గా మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ కాంగ్రెస్, గుండాల జక్కుల శిరీష కాంగ్రెస్ తిమ్మినోనిపల్లి, మూడవత్ శారద కాంగ్రెస్ రాచూరు, గున్నేళ్ళ శ్రీనివాస్ కాంగ్రెస్‌కుప్పగండ్ల, మోక్తాల రమేష్ పెద్దాపూర్, కేశమల్ల అనూష కాంగ్రెస్ శంకర్ కొండ తాండ, ఇస్లావత్ రవీందర్ కాంగ్రెస్ పలుగుతాండ, రమేష్‌నాయక్ కాంగ్రెస్ నారాయణపూర్, బాణావత్ బద్రి కాంగ్రెస్ కుందారం తండా, గన్యా నాయక్ కాంగ్రెస్ ఎంజి కాలనీ, మూడవత్ దస్లి కాంగ్రెస్ ఉప్పల గట్టు తాండ, కేశ్యనాయక్ కాంగ్రెస్ గానుగట్టు తాండ, కేతావత్ మోనిక కాంగ్రెస్, లింగారెడ్డిపల్లి ఎండి అన్వర్ పాషా కాంగ్రెస్, బొల్లంపల్లి ప్రసాద్‌గౌడ్ కాంగ్రెస్, అల్లంతోట బావితాండ రాట్లావత్ జ్యోతి కాంగ్రెస్, బైరాపూర్ తిరుగుడు మంజుల కాంగ్రెస్, మర్రిగుంతతండా వద్యవత్ భాగ్యమ్మకాంగ్రెస్, సిలోని భావితండా రాత్లావత్ లక్ష్మీపతి కాంగ్రెస్, పోతేపల్లి కొండల్‌యాదవ్ టిఆర్ఎస్, చెర్కూర్ బచ్చలకూర శ్రీను టిఆర్ఎస్, అజిలాపూర్ రమేష్‌గౌడ్ బిఆర్ ఎస్, చెదురుపల్లి దన్‌సింగ్ బీఆర్ఎస్, నగరగడ్డ తండా ఆర్. శారదబిఆర్ఎస్, బర్కత్ పల్లి నవ్య బీఆర్ఎస్, రాఘాయిపల్లి సామ వెంకటయ్య బీఆర్ఎస్, కొట్ర శ్యాంపూరి శారద స్వతంత్ర అభ్యర్థి, పోచమ్మ గడ్డతండా మహిపాల్‌నాయక్ స్వతంత్ర అభ్యర్థులుగాగెలుపొందారు. గెలిచిన సర్పంచులను పార్టీ నాయకులు అభిమానులు ప్రజలు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్స్ తినిపించి అభినందనలు తెలిపారు.

## నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్, వార్డు మెంబర్‌కు సన్మానం



ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో ఇటీవల వెలువడిన ఎన్నికల ఫలితాల్లో నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ ఉప సర్పంచ్ మహమ్మద్ నిజాముద్దీన్ సర్కార్ మరియు వార్డు సభ్యుడు సికిందర్‌లకు జామే మజీద్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన మైనార్టీ సభ్యులను సన్మానించినట్లు మజీద్ అధ్యక్షులు ఖాజామైనుద్దీన్ తెలిపారు. సన్మానించిన వారిలో మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకులకు రండి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వానం

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్‌లోని కలవరీ ఎంబీ చర్చిలో ఈ నెల 16వ తేదీన జరగనున్న క్రిస్మస్ సెలబ్రేషన్స్ వేడుకలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ముఖ్య ఆతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఆహ్వాన సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, క్రిస్మస్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంఘం ప్రతినిధులతో మాట్లాడుతూ క్రిస్మస్ సందేశం శాంతి, ప్రేమ, సేవలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇటువంటి వేడుకలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెవ. ఎస్.వరప్రసాద్, బి.ఐ. జాకాబ్, టి.ఎ.స్టెఫెన్, జె.ఐ. డేవిడ్, చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లో ఉన్నత విద్యకు ఉచిత కోచింగ్

**గద్వాల టౌన్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** విదేశీ విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గద్వాలలోని టి.జి.బి.సి స్టడీ సర్కిల్ నందు ఉచిత కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు టి.జి.బి.సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యతో పాటు స్కాలర్ షిప్ పొందేందుకు ఐఈఎల్‌టిఎస్ శిక్షణ, ఇంగ్లీష్ లో మంచి ప్రావీణ్యం పొందుటకు డిగ్రీ పూర్తి చేసిన వారు లేదా డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న బిసి నిరుద్యోగ యువతి, యువకులు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వెబ్సైట్ నందు ఈ నెల 21 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరములకు ఫోన్‌నెంబర్. 9985434941, 88546293022 సంప్రదించాలని కోరారు.

## భర్త ఆశయ సాధనకై...

- గ్రామ ప్రజల ఆత్మ విశ్వాసమే అరుణమ్మ విజయం



మిట్ట సదగోడు సర్పంచ్‌గా ఎన్నికైన అరుణమ్మ

**వంగూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు చేపట్టి పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు, నమ్మిన మిత్రు లకు, శ్రేయోభిలాషులకు నమ్మకస్తుడిగా ఉంటూ వారి విజయాల్లో తనదైన శైలిలో కీలక పాత్ర పోషించిన స్వర్గీయ మంద పాండు రంగారెడ్డి ఆశయ సాధనను కొనసాగించి, గ్రామ ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వారికి అండగా ఉండాలన్న సంకల్పంతో సర్పం చ బరిలోనిలిచిన అరుణమ్మను గెలిపించినాయకుడి ఆశయ సాధనను కొనసాగించారు. గ్రామ ప్రజలు, భర్త చూపినబాటలోనే నడుస్తూ గ్రామ ప్రజలకు ఎలాంటిలోటు రాకుండా ఎల్లవేళలా వారికి అండగాఉండి వారి కష్టసుఖాలలో పాలుపంచుకునే మంచి మనసున్న అరుణమ్మను గెలిపించుకుంటేనే మాకు అన్ని విధాల ధైర్యం ఉంటుందని అరుణమ్మను సర్పంచ్ బరిలోనిలిపించి గెలిపించుకుంటామని చెప్పి గెలిపించిన గ్రామ ప్రజల మమకారానికి అరుణమ్మ గెలుపునిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. గ్రామ అభివృద్ధికి ప్రజల సహాయ సహకారాలతో ముందుకెళ్లి గ్రామాన్ని అభివృద్ధి పరుచుకు నేందుకు కృషిచేస్తామని సర్పంచ్ అరుణమ్మ తెలిపారు. విజయాన్ని అందించిన మిట్ట సదగోడు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాయికోడ్ కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో పార్టీలో చేరుతున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు

**నర్వ, డిసెంబరు12 ప్రభాతవార్త:** నర్వ మండలంలోని రాయికోడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బిజెపి నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకర్గ నాయకులు రాయికోడ్ ఆనంద్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాయికోడ్ గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన 50మంది పార్టీలను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మట్లాడుతూ రాయికోడ్ గ్రామానికి రూ. 90 కోట్ల నిధులతో 11/33 కేవి సబ్ స్టేషన్, రాయికోడ్ నుండి కాట్రేవు పల్లి బిటి రోడ్డు, గ్రామంలో సిసి రోడ్లు వేయించడం జరిగింది. దీంతో పాటు రాయి కోడ్ నుండి సీపూర్ వెళ్ళేమార్గంలో బ్రిడ్జి ఏర్పాటు కోసం నివేదికలు పంపించడం జరిగిందన్నారు. అదే విధంగా పార్టీలో చేరిన వారు మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు అకర్షితులై పార్టీలో చేరుతున్నట్లువారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా, ఎరువులు

**మద్దూరు, డిసెంబరు 12 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలోని పిఎసిఎస్ దమ్‌గన్ పూర్ సహకార సంఘంలో యూరియా, ఎరువు అందుబాటులో ఉందని పిఎసిఎస్ చైర్మన్ గూళ్ళ నరసింహులు తెలిపారు. శుక్రవారం సంఘ కేంద్రంలో మొత్తం 300 యూరియా బస్తాలు రైతులకు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. యూరియా బస్తా ధర రూ. 267 మాత్రమేనని పేర్కొంటూ, ఎరువులు కావలసిన రైతులు తమ ఆధార్ కార్డు, భూసారం పాసుబుక్ జిరాక్స్ సమర్పించి బస్తాలను పొందవచ్చని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంఘం కార్యాలయాన్ని సంప్రదించి యూరియా తీసుకోగలరని పిఎసిఎస్ చైర్మన్ నరసింహులు కోరారు.

## అగ్నికి ఆహుతైన పత్తి



రైతును పరామర్శిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**ఉప్పునుంతల, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఆరుగాలం కష్టించి పండించిన పత్తిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో రోదిస్తున్న రైతన్నను శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు పరామర్శించి ధైర్యం అందించారు. మండల కేంద్రమైనఉప్పు నుంతలలో బిసి కాలనీ (తూర్పు) లో మేడమోనీ తిరుపతయ్యకు చెందిన దాదాపు 30 క్వింటాళ్ల పత్తిగుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పత్తి బుగ్గిపాలయింది. దాదాపు 10 క్వింటాల పత్తి పూర్తిగా ధ్వంసం కావడంతో బిఆర్ఎస్‌నాయకులు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్ట గోపాల్ రెడ్డి, అచ్చంపేట మున్సిపల్ కౌన్సిలర్స్ అంతటి శివ, సిరిసన గండ్ల రమేష్ రావు, ఉప్పునుంతల గ్రామ కమిటీ అధ్యక్షుడు మోడ మోని శ్రీనివాసులు, బొల్లె మల్లయ్య, బిఆర్ఎస్ యువ నాయకులు చిన్న జంగయ్య, ఎల్లయ్యయాదవ్, సిహెచ్ సుధాకర్, మల్లేష్, యాదగిరి, బాలస్వామి, బాలకృష్ణ, మల్లేష్, అరుణ్, సందీప్ సింగ్ తదితరులు ఉన్నారు.

